సాక్షి వికారాబాద్

ఆదివారం । 23 । జూలై । 2023



నిండుకుండల్లా చెరువులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది.

8లో▸



దొంగలకు దేహశుద్ధి

కొడంగల్‌లోని ఇంద్రానగర్ కాలనీలో చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకుని దేహశుద్ధి చేశారు.

8లో▸



పండ్ల రైతుకు పండగ

పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది.

9లో▸

న్యూస్‌రీల్

కొత్త రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.96 కోట్లు



సీఎం కేసీఆర్ నుంచి జీఓ కాపీని అందుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

అనంతగిరి: వికారాబాద్ రైల్వే కొత్త వంతెన నిర్మాణానికి రూ.96 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు నగరంలో సీఎం కేసీఆర్ నుంచి జీఓ కాపీని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అందుకున్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన సమస్య అయిన రైల్వే వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు సీఎంకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నాపరాతి గనుల్లో అధికారుల తనిఖీలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్, మల్కాపూర్ ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న నాపరాతి గనుల్లో మైనింగ్ అధికారులు తనిఖీలు చేశారు. శనివారం మైనింగ్ ఏడీ సాంబశివరావు, ఆర్‌ఐ రమేష్‌లు క్షేత్రస్థాయిలో గనుల్లోకి వెళ్లి కటింగ్ మిషన్లు, బ్లేడ్లు సీజ్ చేశారు. మైనింగ్ పర్మిషన్ లేకుండా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని ఏడీ తెలిపారు. కరన్‌కోట్‌లో సర్వే నంబర్ 2, మల్కాపూర్‌లో సర్వే నంబర్ 115లో తనిఖీలు చేశామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం సందర్భంగా నాపరాతి గనులు మునిగినట్లు చెప్పారు.

చేపల వలలో 'బంగారు తీగ'



వలకు చిక్కిన బంగారుతీగ రకం చేప

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని పెద్దచెరువు పాటుకాలువలో శనివారం కొంతమంది యువకులు చేపలు పట్టారు. ఇందులో బంగారుతీగ రకం భారీ చేప వలకు చిక్కింది. చిట్లపల్లికి చెందిన శేఖర్‌తోపాటు ఆయన ఇద్దరు స్నేహితులకు సుమారు ఆరు కిలోల చేప లభించింది. భారీ చేప లభించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

కుక్కల దాడిలో జింక మృతి



మృతి చెందిన జింక

పూడూరు: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. తరచూ వేట కుక్కల దాడిలో జింకలు మృత్యువాత పడుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు, వేటగాళ్ల ఉచ్చులో జింకలు మృత్యువాత పడుతున్నాయని అన్నారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దాశరథి కృష్ణమాచార్యకు ఘన నివాళి

కొడంగల్ రూరల్: ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనంత సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కృష్ణమాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహిత్య వేదిక జిల్లా కార్యవర్గ సభ్యుడు, కవి, రచయిత మాసాని వెంకటయ్య, జాతీయ విద్యా రత్న అవార్డు గ్రహీత ఎరన్‌పల్లి శ్రీనివాస్, తెలుగు అధ్యాపకులు బత్తుల మల్లయ్య, పండరి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలం, గళంతో యావత్ ప్రజానీకాన్ని చైతన్య పరిచిన మహాయోధుడు దాశరథి కృష్ణమాచార్య అని కొనియాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అనే మాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిని కలిగించి ఆవిర్భావానికి నాంది పలికిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు లక్ష్మీనారాయణ, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి గుట్టల్లో పర్యాటకుల కోలాహలం

అనంతగిరుల్లో .. ప్రజల సందడి

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టకు పర్యాటకుల తాకిడి పెరిగింది. శనివారం ఉదయం వానలు విరామమివ్వడంతో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు అనంతగిరికి తరలి వచ్చారు. గుట్టల్లోని ఎత్తయిన ప్రదేశాల నుంచి జాలువారుతున్న వర్షపు నీటి అందాలను తిలకించారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడిగా గడిపారు. కాగా బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తమ పిల్లలతో కలిసి అనంతగిరిలో పర్యటించారు. – అనంతగిరి



జలధారలో చిన్నారుల కేరింతలు

తస్మాత్ జాగ్రత్త!

వాగులు ఉధృతి.. దిగితే అధోగతి

- అజాగ్రత్తతోనే గల్లంతవుతున్న జనం
- సహాయక చర్యల్లో యంత్రాంగం



పరిగి -వికారాబాద్ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో రాకపోకలు

వికారాబాద్: ఎడతెరిపిలేని వానలు.. పొంగి పొర్లుతున్న వాగులు.. జిల్లాలో ఎప్పుడు లేని బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ప్రాణ, ఆస్తి నష్టం కలిగిస్తున్నాయి. కొన్ని చోట్ల అజాగ్రత్త ప్రాణాలను హరిస్తుండగా.. మరి కొన్ని చోట్ల ఊహించని ప్రవాహ ఉధృతి కనురెప్ప పాటులో కబళిస్తోంది. తాజాగా ధారూరు మండలంలో పొంగిపొర్లుతున్న వాగులోంచి ట్రాక్టర్‌పై వెళ్తూ మధ్యలోనే చిక్కుకున్న ఐదుగురు రైతులను స్థానికులు రక్షించి ఒడ్డుకు చేర్చారు. తాండూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తూ గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు కొనసాగుతుండగా అతని ఆచూకీ ఇంకా లభించలేదు. ఐదు రోజులుగా వరుణుడు శాంతించకుండా రోజురోజుకు విజృంభిస్తుండటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రహిస్తున్నాయి. చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి.

అధిక వర్షాలు ఓ పక్క పంటలను దెబ్బతీస్తుండగా.. మరో వైపు ప్రాణ, ఆస్తి నష్టాన్ని కూడా అదే స్థాయిలో కలిగించే పరిస్థితి తలెత్తింది. రెండేళ్ల క్రితం ఇలాగే వరుణుడు సృష్టించిన బీభత్సానికి జిల్లాలో పొంగిపొర్లుతున్న వాగుల్లో చిక్కుకుని ఏడుగురు మరణించారు. 11 మంది గల్లంతై చివరకు బతికి బయటపడ్డారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే అధికార యంత్రాంగం జాగ్రత్త చర్యలు చేపట్టడంతో పాటు ప్రజలు తమ ప్రాణాలకంటే ఏదీ ఎక్కువ కాదని గ్రహించి సహసాలకు దూరంగా ఉండటమే మేలు.

ప్రత్యామ్నాయ చర్యలు లేకే..

గడిచిన వారం రోజులుగా జిల్లాలో ఎప్పుడూ లేని విధంగా వరద ప్రవాహం కొనసాగుతోంది. కొందరు వరద పరిస్థితిని అంచనా వేయలేక అజాగ్రత్తతో గల్లంతవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రైతులు, పశువుల కాపరులు ఒక రోజు, రెండు రోజులు అంటే పశువులను ఇంట్లో పెట్టుకుని ఏదో మేత వేస్తారు. కానీ వారాల తరబడి వర్షం కురిస్తే వారు బయటకు తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈక్రమంలో వాగులు దాటుతూ గల్లంతవుతున్నారు. గతంలో జరిగిన చాలా ఘటనల్లో వంతెనల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవటం, నిర్మాణంలో వంతెనల దగ్గర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సక్రమంగా చేయకపోవటం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. అధికారులు ఈసారి వర్షాలు కురుస్తున్న రెండో రోజు నుంచే అప్రమత్తమై జాగ్రత్త చర్యలు చేపడుతుండటం కాస్త ఉపశమనం కలిగిస్తోంది.

రైతులకు ప్రాధాన్యమేదీ?



ఎక్కడైనా ఓ చిన్న కంపెనీ ఏర్పాటు చేస్తున్నా.. ఓ ప్రాంతంలో ఎవరైనా బడా నాయకులు భూములు పోగేసుకున్నా.. ఆ ప్రాంతంలో ఎవరూ అడగకపోయినా.. రోడ్లు, బ్రిడ్జీలతో సహా అన్ని సౌకర్యాలు సమకూరుతాయి. అదే మనకు తిండి పెట్టే రైతులు నిత్యం వెళ్లే దారులు మాత్రం ఎవరికీ కనిపించవు. మాది రైతు ప్రభుత్వం అని చెప్పుకునే నేతలకు సైతం ఇవేవి పట్టవు. పొలాలకు వెళ్లే దారులు బాగు చేయాలి.. బ్రిడ్జీలు, వంతెనలు నిర్మించాలి.. లేదంటే వర్షం కురిసిన ప్రతి సారి ఏదో ఒకచోట తప్పని పరిస్థితిలో వారు వాగులు దాటం.. గల్లంతవటం చూస్తూనే ఉంటాం.

– ముకుంద్ నాగేశ్వర్, జేఏసీ జిల్లా చైర్మన్

కాజ్‌వేల వద్ద బందోబస్తు



వాగులు, చెరువుల అలుగులు పొంగి పొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదకంగా ఉన్న అన్ని కాజ్‌వేల దగ్గర పోలీసు బందో బస్తు ఏర్పాటు చేస్తున్నాం. అయితే పోలీసులను ఉంచిన చోటును వదిలేసి వాహనదారులు వేరే రూట్లను ఎంచుకుని వెళ్తున్నారు. రెండుమూడు చోట్ల ఇలాంటి ఘటనలే జరిగాయి. సాధ్యమైనంత వరకు సేఫ్ రూట్లలో వెళ్లాలి. చెరువుల అలుగుల వద్ద సహసాలు చేయటం, సెల్ఫీలు దిగడం చేయకూడదు. ఉధృతంగా ప్రవహించే వాగుల్లోంచి ఎట్టి పరిస్థితిలోనూ దాటే ప్రయత్నంచేయవద్దు.

– కోటిరెడ్డి, ఎస్పీ

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి. చిత్రంలో అదనపు కలెక్టర్లు తదితరులు

- కలెక్టర్ నారాయణరెడ్డి
- సెక్టోరల్, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమావేశం

వికారాబాద్ అర్బన్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సదుపాయాలు లేని కేంద్రాలను గుర్తించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తహసీల్దార్లు, సెక్టోరల్, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం, టాయిలెట్స్ తో పాటు ఇతర మౌలిక వసతులు ఉండేలా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలన్నారు. 1500 దాటిన ఓటర్ల పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన వారు ఓటర్‌గా నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ట్రెయినీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీఓలు విజయ కుమారి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పారిశద్ధ్య పనులు ముమ్మరం చేయండి

వికారాబాద్ అర్బన్: వర్షాలు తగ్గుముఖం పట్టినందున వ్యాధులు ప్రబలకుండా అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం టెలికాన్ఫరెన్సులో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. మురికి కాలువల్లో చెత్తాచెదారం, గుంతలలో రోడ్లపై నీరు నిలువకుండా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ట్యాంకులు శుభ్రం చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన మందులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురిసినందున హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అందరూ సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు , మున్సిపల్ కమిషనర్లు, భగీరథ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

'లోటు' తీరేలా..

జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలు

- సాధారణంకన్నా అధిక వర్షపాతం నమోదు
- చెరువులు, కుంటలు, ప్రాజెక్టులకు జలకళ

తాండూరు: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జిల్లా మొత్తం జలమయమైంది. వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి లోటు వర్షపాతం ఆందోళన కలిగించగా.. ఏకధాటి వానలు పరిస్థితిని మార్చేశాయి. శనివారం వాతావరణ శాఖ విడుదల చేసిన వివరాలలో పూడూరు మండలంలో 54.1 మిల్లీమీటర్లు, మోమిన్‌పేట్‌లో 51.0, వికారాబాద్‌లో 49.6, పరిగిలో41.1, తాండూరులో44.3 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో సాధారణ వర్షపాతం రికార్డయింది. వారం క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా మండలాల్లో అత్యల్ప వర్షపాతం ఆందోళన కలిగించింది. నాలుగు రోజులుగా విస్తారంగా కురిసిన వానలతో ఈ లోటు తీరింది. 20 మండలాలకు గాను 12 చోట్ల అత్యధిక, 8 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు ధ్రువీకరించారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 233 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 405 ఎంఎంలుగా రికార్డయింది. రైతులు సాగు చేసిన స్వల్పకాలిక పంటలైన పెసర, మినుము, సోయ.. భారీ వర్షాలతో నీట మునిగాయి. పట్టణాల్లోని ప్రధాన మార్గాలు చిత్తడిగా మారాయి. గ్రామీణ రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.



పత్తి పంటలో నిలిచిన వరద నీరు

సూర్య దర్శనం..

ఆకాశంలో ఈ నెల 17న కనిపించిన సూర్యుడు ఆరు రోజులుగా ముఖం చాటేశాడు. మేఘాలు కమ్మేయడంతో సూర్యభగవానుడి దర్శనం కలగలేదు. శనివారం మధ్యాహ్నం వర్షం తగ్గుముఖం పట్టడంతో మబ్బులను చీల్చుకుంటూ బయటకు వచ్చాడు. అప్పటి వరకు చల్లటి వాతావరణంతో ఇబ్బంది పడిన జనం బయట కూర్చుని ఉపశమనం పొందారు.



వర్షానికి ధ్వంసమైన తాండూరు- హైదరాబాద్ మార్గం

చుట్టూ వాగులే.. వానాకాలం గుబులే

- ఏరు దాటితేనే.. ఊరు చేరేది!
- వంతెనలకు నోచుకోని మహంతీపూర్
- ఎవరికీ పట్టని గ్రామస్తుల గోస
- ఏటా తప్పనితిప్పలు

బొంరాస్‌పేట: 'వానాకాలం'.. అంటేనే ఊరంతా ఉలిక్కి పడుతుంది. ఊరుచుట్టూ వాగులున్నాయి. వాటికి వంతెనలు లేకపోవడంతో వర్షాలకు నిండుగా పారి రాకపోకలు నిలిచిపోతాయి. గ్రామస్తులు ఈదుకుంటూ అటు ఇటు రాకపోకలు సాగిస్తారు. వానాకాలంలో మండల పరిధిలోని మహంతీపూర్ వాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పాలకులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకున్న పాపానపోవడంలేదు. బొంరాస్‌పేట శివారులోని మహంతీపూర్ అనుబంధ గ్రామంగా ఉండేది. గ్రామపంచాయతీల పునర్విభజనలో మహంతీపూర్ మండల కేంద్రం బొంరాస్‌పేట నుంచి వేరుగా అయ్యింది. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేని కారణంగా విద్య, వైద్యం, అధికారులు, ప్రజా ప్రతినిధుల సేవలు కరువయ్యాయని గ్రామస్తులు నేటికీ వాపోతున్నారు. గ్రామానికి ఆనుకొని కాకరవాణి, చీమలవాగు, దేవనూరు వాగులు వానాకాలంలో ప్రమాదభరింతంగా ప్రవహిస్తాయి. పొలాలకు వెళ్లేందుకు సైతం గ్రామ ప్రజలు జంకుతారు. ఈత వచ్చిన వారు వాగులు ఈదుతూ ప్రాణాపాయ పరిస్థితుల్లో చేరుకుంటారు. వాగులపై వంతెనలు లేనందున మండల కేంద్రానికి రాకపోకలు ఇబ్బందిగా మారాయి. విద్యార్థులు, రైతులు, ప్రజలు ఇతర గ్రామాలను వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. వాగులకు ఆనకట్టలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించి వాగు పరీవాహక భూములకు సాగునీరు అందిస్తే దాదాపు 80 రైతు కుటుంబాలు నిరంతర వ్యవసాయంతో బాగుపడుతాయంటున్నారు.



మహంతీపూర్ సమీపంలోని కాకరవాణి వాగులో ఈదుతూ వస్తున్న గ్రామస్తులు

మద్దిమడుగుతండాలోనూ..

అలాగే గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ నివాస ప్రాంతం మద్దిమడుగుతండాలో 45 కుటుంబాలున్నాయి. 2.5 కిలో మీటర్ల దూరం ఉన్న తండాకు రోడ్డు సౌకర్యంలేదు. ఊళ్లోకిరావాలన్నా అత్యవసర పరిస్థితుల్లో, వర్షాకాలంలో రాకపోకలకు తండావాసుల అవస్థలు వర్ణణాతీతం. గ్రామానికి, తండాకు రోడ్డు సౌకర్యం కోసం ఇటీవల సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అయినా నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

వంతెనల నిర్మాణాలు కలేనా?

మా గ్రామానికి రాకపోకలు సాగించేందుకు వాగులపై వంతెనల నిర్మాణాలు ఉత్తిదేనా?.. అంటూ మహంతీపూర్ గ్రామప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రానికి అనుబంధ గ్రామంగా ఉండి మహంతీపూర్ ప్రత్యేక పంచాయతీ అయినప్పటికీ సమస్యలు తీరడంలేదని వారు చెబుతున్నారు. ఊరు చుట్టూ వాగులతో 'ఏరు దాటితేనే ఊరు చేరేది' అన్న చందంగా మారింది. వాగుదాటే క్రమంలో పలు మృతి సంఘటనలు, మృత్యువునుంచి బయటపడిన సంఘటనలు కూడా ఉన్నాయి.

వంతెనలు తప్పనిసరి



గ్రామం నుంచి బొంరాస్‌పేట, జానకంపల్లి, మద్దిమడుగుతండాకు వెళ్లాలంటే వాగులు దాటాల్సిందే. వాగులనుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఊరికి బస్సులు, వాహనాల సౌకర్యం అస్సలే లేదు. మహిళలు వాగులు దాటలేక యేటా ఊళ్లోనే మగ్గుతున్నాం.

– రాములమ్మ, మహంతీపూర్

రాకపోకలు బంద్



పంచాయతీ పరిధిలోని మద్దిమడుగుతండానుంచి పంచాయతీకి వెళ్లాలంటే వంతెన లేనికారణంగా ఇబ్బందులుపడుతున్నాం. వానకాలంలో నిలువెత్తు వాగుపారుతుండగా తండాకు, గ్రామానికి రాకపోకలు జరగడంలేదు. వంతెనను తప్పనిసరిగా నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

– దేవ్‌సింగ్, ఉపసర్పంచ్, మద్దిమడుగుతండా

ఏళ్లుగా తిప్పలే..



మా ఊరు చుట్టూ వాగులున్నాయి. ఊరందరికి ప్రధాన సమస్య వంతెన లేకపోవడమే.. మండల కేంద్రానికి, తండాకు రాకపోకలు జరిగేందుకు కాకరవాణి వాగుపై వంతెన తప్పనిసరి. దీని నిర్మాణానికి నిధులు పెద్ద మొత్తంలో అవసరమవుతాయి. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవిస్తాం.

– మహిపాల్, సర్పంచ్, మహంతీపూర్

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అధికారులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

పూడూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వెస్లీ అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని చీలాపూర్, మన్నెగూడ గ్రామాల్లో పర్యటించారు. ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. రోడ్లలో నీరు నిలవకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ప్రతి రోజూ సాయంత్రం ఫాగింగ్ చేయాలన్నారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. నీరు నిలిచే ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీపీఓ తరుణ్, ఎంపీడీఓ ఉమాదేవి, సర్పంచ్‌లు రాములు, వినోద్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్యామప్ప, లక్ష్మి, చందు, అంబరప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయండి

తాండూరు టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు పీ అనిల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో ఈ నెల 29న నిర్వహించనున్న సంకల్ప రథయాత్రలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని కోరారు. ఆగస్టు 12న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు ఆంజనేయులు, రవీందర్, శ్రీను, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేకల మృతి

దోమ: మండలంలోని ఐనాపూర్‌లో శనివారం విద్యుత్ షాక్‌కు గురై నాలుగు మేకలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన శ్రీను తన మేకలను ఎప్పటిలాగే మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. మేత మేసే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృత్యువాత పడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మేకల విలువ రూ. 60వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

అడుగడుగులో గొడుగు

- అనాదికాలం నుంచి ఆధునిక యుగం వరకూ రక్షణ కవచంలా..
- వేసవి, వానా కాలాల్లో విరివిగా వినియోగం
- వరుస వర్షాలతో భారీగా పెరిగిన వాడకం



వర్షానికి తడవకుండా..

బొంరాస్‌పేట: వానా కాలం, ఎండా కాలంలో వర్షం ,ఎండ నుంచి రక్షించేందుకు అందరూ గొడుగు వాడుతుంటారు. జిల్లాలో ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రస్తుతం ఎవరి చేతిలో చూసినా గొడుగు కనిపిస్తోంది. పొలాలకు వెళ్లే రైతులు.. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు.. ఉపాధి.. ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగులు, అధికారులు వారు ఇలా ప్రతిఒక్కరూ ఛత్రీని వాడుతున్నారు.

అనాదిగా వినియోగం

రాచరిక పాలన నుంచే గొడుగుల వాడకం మొదలైంది.చక్రవర్తులు..మహారాజులు వారి సింహాసనాలపై గొడుగును ఏర్పాటు చేయించేవారు. కాలినడకన వెళ్లే సమయంలో భటులు వీరికి గొడుగు పట్టేవారు. అప్పట్లో ఇది రాజ దర్పణానికి నిదర్శనంగా ఉండేది. కాలం గడిచిన కొద్దీ సాధారణ ప్రజలు కూడా గొడుగులు వాడటం ప్రారంభించారు. ఎండ, వాన నుంచి రక్షించుకునేందుకు ఛత్రీలు అందరికీ అందుబాటులోకి వచ్చాయి. రాచరిక పాలన అంతరించిపోవడంతో వీటి వినియోగాన్ని ఎవరూ అడ్డుకునే పరిస్థితి కూడా రాలేదు. ఈ క్రమంలో ప్రతీ ఇంట్లో గొడుగు అత్యవసర వస్తువుగా మారిపోయింది.

సంస్కతి, సంప్రదాయాల్లోనూ..

శుభ,అశుభ కార్యాల్లోనూ గొడుగుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. వివాహాలు, శవ యాత్రల్లోనూ గొడుగులు వాడుతుంటారు. ఆయా కార్యాల్లో గొడుగు పట్టడం సంప్రదాయంగా వస్తోంది. ఒకసారి చరిత్ర లోపలికి వెళ్తే.. మన పూర్వీకులు సైతం గొడు గులు విరివిగా వాడారని తెలుస్తోంది. అప్పట్లో మోతుబరి రైతులు, సంపన్నులతో పాటు సాధారణ వ్యక్తులు సైతం ఛత్రీలను వాడిన సందర్భాలు కనిపిస్తాయి. దేవుళ్లు, రాజులకు పట్టే గొడుగులకు మొన ఉండదు.. వీటిని చెక్క, లేదా ఇనుముతో తయారు చేసేవారు. వీటిని మలిచి పెట్టే వీలుండ దు. కానీ ప్రస్తుతం మనం వాడుతున్న గొడుగులను చిన్నగా, అతి చిన్నగా మలుచుకునే వీలుంది. అవసరాన్ని బట్టి వాడుకుని, ఆతర్వాత చిన్నగా మలిచేసి సంచీలో పెట్టుకునే వెసులుబాటుంది.

అనేక ఉపయోగాలు..

కొన్ని సంవత్సరాల క్రితం ప్రతీ విద్యార్థి, గురువు వద్ద అన్ని కాలాల్లోనూ గొడుగు ఉండేది. గొడుగు చేతిలో ఉంటే ఎండా, వానకు రక్షణతో పాటు చేతిలో ఆయుధంగానూ ఉంటుందని భావించేవారట. మరికొందరు ఛత్రీనే చేతి కర్రగా వాడేవారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రస్తుతం గొడుగులు కనుమరుగై టోపీలు దర్శనమిస్తున్నాయి. వీటిలో వాటర్ ప్రూఫ్ క్యాప్‌లు వాన నుంచి రక్షిస్తున్నాయి. ఇక వేసవిలో కాటన్‌తో తయారు చేసిన టోపీలు వాడుతూ చల్లదనం పొందుతున్నారు. గొడుగు పట్టుకోవడాన్ని నామూషీగా భావించే యువకులు స్టైల్‌గా టోపీలు పెట్టుకుంటున్నారు.



బిడ్డకు గొడుగుతో నీడ పడుతున్న తల్లి

ఎన్నికలకు సహకరించాలి

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- అఖిలపక్ష నాయకులు, తహసీల్దార్లతో సమావేశం
- పోలింగ్ కేంద్రాలపై అవగాహన
- ఆగస్టు 21న డ్రాఫ్ట్ పబ్లికేషన్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలపై అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ శనివారం అఖిలపక్ష నాయకులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా పార్టీల నేతలతో పాటు ఎనిమిది మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలపై అవగాహన కల్పించారు. సెంటర్ల వద్ద ఏవైనా సమస్యలు ఉంటే.. కొత్త ప్రాంతానికి మారుస్తామని తెలిపారు. అభ్యంతరాలు, సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. అనంతరం కొత్త పోలింగ్ సెంటర్ల ఏర్పాటుపై చర్చించారు. 2023 ఎన్నికల నేపథ్యంలో ఆగస్టు 21న ఓటరు డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. వీటిలో ఏవైనా తప్పులు ఉంటే మార్పు చేయించుకోవాలన్నారు. ఈవీఎంలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఓటు హక్కుపై ఎవరికైనా సందేహాలుంటే చెప్పాలన్నారు. ఎన్నికలకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని, పోలింగ్ శాంతియుతంగా జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బుచ్చయ్య, కృష్ణయ్య, షర్మిల, భీమయ్య, మమత, పాండు, డీటీ సురేష్, ఎలక్షన్ డీటీ శివకుమార్, అఖిలపక్ష నాయకులు మధుసూదన్‌రావ్ యాదవ్, కృష్ణంరాజు, చంద్రప్ప, రమేష్‌బాబు, ఇందనూర్ బషీర్ శ్యాంసుందర్, ముస్తాక్, తలారి శేఖర్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్



కోళ్ల పరిశ్రమ రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: వర్షాల కారణంగా నష్టపోయిన వ్యవసాయ అనుబంధ రంగాల రైతులను ఆదుకుంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం బొట్యానాయక్ తండా పరిధిలోని శివ అనే రైతుకు చెందిన పౌల్ట్రీ ఫాం గోడలు కూలి కోళ్లు చనిపోయిన విషయం తెలిసిందే. శనివారం ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ వేర్వేరుగా పౌల్ట్రీ ఫాంను పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు. తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

దొంగలకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగింత



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో శనివారం పట్టపగలు దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వారిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీ సులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నా యి. ఇంద్రానగర్ కాలనీకి చెందిన లక్ష్మమ్మ సొంత పనుల నిమిత్తం ఉదయం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లింది. గమనించిన షేక్ షాహెద్, సమీర్ ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టే క్రమంలో శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు లక్ష్మమ్మ ఇంటికి వచ్చారు. ఆమె కనిపించకపోవడం, బీరువా తాళాలు పగులగొడుతుండడంతో అనుమానం వచ్చి షేక్ షాహెద్, సమీర్ అదుపులోకి తీసుకొని విచా రించారు. వారు దొంగతనానికి వచ్చినట్లు తేలడంతో దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీ సులకు సమాచారం ఇచ్చారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నిండుకుండల్లా చెరువులు

ఐదు రోజులుగా జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువులు, కుంటల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే పలు మండలాల్లో చెరువులు నిండాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.



పెద్దేముల్: నీటితో కళకళలాడుతున్న కొండాపూర్ చెరువు

పెద్దేముల్: మండలంలో చెరువులు, కుంటలు నీటితో కళ కళలాడుతున్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 52 చెరువులు, కుంటలు ఉన్నాయి. మంబాపూర్ పెద్ద చెరువు, కొండాపూర్ కొండ చెరువు, పెద్దేముల్ పెద్ద చెరువులు అలుగులు పారుతు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గితే వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

'నందివాగు'కు జలకళ

మోమిన్‌పేట: ఐదు రోజులుగా కురుస్తున్న వానలకు నందివాగు ప్రాజెక్టు నిండింది. మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

వర్షాలకు కూలిన ఇంటి గోడ

యాలాల: మండలంలోని బాణాపూర్‌లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఓ ఇంటి గోడ కూలిపోయింది. వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి గ్రామానికి చెందిన శంకర్ నాయక్ ఇంటి వెనుక భాగం గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని కలిశారు. ఇల్లు కూలిన విషయం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

చెరువుకు గండి

పరిగి: నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండడంతో మిట్టకోడూర్ చెరువు నిండింది. రెండు రోజుల క్రితం చెరువు రెండో తూము వద్ద చిన్నపాటి గండి పడి నీరు దిగువకు పోతోంది. రోజురోజుకు గండి పెద్దదిగా మారుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు కట్టకు ప్రమాదం ఉందని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

వర్షాలతో అవస్థలు

కుల్కచర్ల: ఏకధాటి వర్షాలతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం లాల్‌సింగ్ తండాకు చెందిన బిల్యానాయక్ ఇల్లు ఓ పక్క కూలిపోయింది. చాపలగూడెం పంచాయతీ పరిధిలోని మైలమ్మ చెరువు కల్వర్టు తెగిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పరిహారం చెల్లించాలి



పెద్దేముల్: ఇందూరులో వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

పెద్దేముల్: ఐదు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి కూలిపోయిన ఇళ్లకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలని ఇందూరు సర్పంచ్ పద్మమ్మ కోరారు. శనివారం మండలంలోని ఇందూరు, ఆత్కూర్, మరి కొన్ని గ్రామాల్లో కూలిన ఇళ్లను ఎంపీడీఓ లక్ష్మప్పతో కలసి పరిశీలించారు. కూలిన ఇళ్ల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామని ఎంపీడీఓ తెలిపారు. వర్షాలకు ఎరువులు తడిసి రైతులు నష్టపోయారని, వారిని ఆదుకోవాలని తట్టెపల్లి పీఏసీఎస్ డైరక్టర్ మొగులప్ప అధికారులను కోరాడు.

దొరకని ఆచూకీ

- వాగులో గల్లంతైన వ్యక్తి కోసం కొనసాగుతున్న గాలింపు
- ఆందోళనలో కుటుంబ సభ్యులు



సంగెంకలాన్ వాగులో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న పోలీస్, ఫైర్ సిబ్బంది

తాండూరు రూరల్: మండలంలోని సంగెంకలాన్ వాగులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. గ్రామానికి చెందిన పెంటప్ప శుక్రవారం రాత్రి ఊరు శివారులోని వాగు దాటుతుండగా గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఫైర్ ఆఫీసర్ నాగార్జున సిబ్బంది శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. కొందరు కానిస్టేబుళ్లు ట్యూబ్‌ల సాయంతో వాగులో గాలింపు చేపట్టారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. తహసీల్దార్ చిన్నప్పల నాయుడు, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, అధికారులు, సర్పంచ్ మేఘనాథ్ గౌడ్, బీజేపీ నాయకులు సంజీవ్‌రెడ్డి వాగుల వద్దే ఉండి పర్యవేక్షించారు. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆదేశాలతో బీఆర్‌ఎస్ మండల నాయకులు సంగెంకలాన్ గ్రామానికి చేరుకొని గాలింపును పర్యవేక్షించారు.

వర్షాల వేళ.. సూచనలు ఇలా..



నారెగూడలో కురుస్తున్న వాన

- అధిక వర్షాలతో పంటలకు నష్టం: ఏవో ప్రసన్నలక్ష్మి



ప్రసన్నలక్ష్మి

నవాబుపేట: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వానాకాలంలో సాగు చేసిన పంటలన్నింటికీ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఈ తరుణంలో రైతులు తగు జాగ్రత్తలు తీసు కోకుంటే పంటలు పాడైపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. పంటలుకాపాడుకునేందుకు రైతులు సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి సూచించారు.

వాతావరణ ఆధారిత సాగులో సలహాలు

మూడు రోజులుగా రాష్ట్రంలో చాలా చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 23 నుంచి 30 డిగ్రీల సెల్సీయస్, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 25 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సమాచారం ప్రకారం రాబోవు ఐదు రోజుల్లో రాష్ట్రంలో ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు, వివిధ జిల్లాల్లో అనేక చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

- భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి మురుగు నీరు తీసివేయాలి
- మరో ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలంలో నీటిని తీసివేయడానికి కాలువలు చేసుకోవాలి. మందుల పిచికారీని వాయిదా వేసుకోవాలి.

వరి సాగులో..

- వర్షాల కారణంగా నారు వరి పొలంలో నిండిన నీటిని తీసివేయాలి
- ప్రస్తుత పరిస్థితిల్లో నారుమడికి అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంది
- నివారణకు ట్రైసైక్లజోల్ - మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి
- పొలం గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి
- ఇప్పటికే నాటిన వరికి కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉంది
- నివారణకు కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిపోల్ 0.4జి గుళికలు చల్లాలి

మొక్కజొన్న సాగులో..

- మొలకెత్తి 10, 15 రోజుల్లో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉంది. పురుగు ఉధృతిని బట్టి నివారణకు వేప నూనె 5 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- కాండం తొలుచు పురుగు నివారణకు 30-40 రోజుల మధ్య కాలంలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరానికి 3 కిలోలు మొక్క యొక్క ఆకుసుడుల్లో వేసుకోవాలి

కంది సాగులో..

- కందిని ఏక పంటగా లేదా పత్తి, జొన్న, మొక్కజొన్న, పెసర, మునుములో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.

సోయాచిక్కుడు సాగులో..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉపయోగించుకొని గింజ మొలకెత్తిన చోట తిరిగి అదే రకం విత్తనాలను విత్తుకోవాలి. మబ్బులతో కూడిన వర్షపు వాతావరణ పరిస్థితుల్లో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించవచ్చు. నివారణకు 10 లీటర్ల నీటిలో గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ ప్లస్ 30గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

పశుపోషణ

- గేదెలు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నిమోనియా, గొంతు వాపు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. నివారణకు టీకాలు వేయించుకోవాలి.
- గొర్రెలు: మసూచి వ్యాధి వచ్చే అవకాశం ఉంది. నివారణకు టీకాలు వేయించుకోవాలి.
- కూరగాయల పంటల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలి. లేకపోతే అవి కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

సూచనలు పాటించాలి

అనంతగిరి: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నుంచి పత్తి, కంది, మొక్కజొన్న, సోయా, చిక్కుడు పంటలను కాపాడుకోవడానికి రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఏఈఓ అనిల్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని పెండ్లిమడుగు గ్రామంలో పొలాలను ఆయన పరిశీలించారు. పొలంలో నిలిచిన మురుగు నీటిని వెంటనే తీసివేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చిరెడ్డి, ఉప సర్పంచ్ బందయ్య పాల్గొన్నారు

రోడ్డుపై గుంతలు.. అదుపుతప్పిన బైక్

వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కొడంగల్ రూరల్: రోడ్డుపై గుంతల కారణంగా బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన శనివారం సాయంత్రం పట్టణ శివారులోని తాండూరు రోడ్డులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం గోకఫస్లాబాద్ గ్రామానికి చెందిన లాలూనాయక్ తాండూరు నుంచి బైక్ కొడంగల్‌కు బయలుదేరాడు.. మార్గమధ్యలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఉండడంతో వాటిని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లాలూనాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు దిగితే అంతే..!

దోమ: ఎడతెరపి లేని వర్షాల కారణంగా మండలంలోని దిర్సంపల్లి గేటు- బట్లచందారం రోడ్డు బురదమయంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శనివారం బట్లచందారం గ్రామానికి అంగన్‌వాడీ సరుకులు తీసుకెళుతున్న ఆర్టీసీ కార్గో బస్సుకు మార్గమధ్యలో బైక్ ఎదురుగా రావడంతో దానికి దారి ఇచ్చే క్రమంలో బురదలో ఇరుక్కుపోయింది. సిబ్బంది అతికష్టం మీద బస్సును బురద నుంచి బయటికి నెట్టారు. గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు ప్రారంభం కాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ కార్గో బస్సును బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న సిబ్బంది